


సోయగాలు ఒలికిస్తూ అందాన్నంతా తనలో ఇముడ్చుకున్నటుగా ఉన్న ఒక భవనంలో అంతా రంగుల మయమై మనోహరంగా అలంకరింప బడిన గదిలో కోసల వీణా తంత్రులను మీటుతూ సాధన చేస్తోంది. సాధన మంచి వున్నత స్థాయిలో వున్నపుడు తీగ టప్పున తెగి కింద రాలింది. ఒక్కసారిగా కోసల వ్యాకులచిత్తయై తెగిపోయిన తీగ వంక నిర్నిమేషదృష్టితో చూసింది.

ఇంతలో ఒక నౌకరు వచ్చి "అమ్మా! శశాంక బాబుగారు వచ్చారు. అన్నాడు.

ఒక్కసారిగా కోసల మొహంలో రక్తవాహిని వెలికి చిమ్ముతున్నట్లుగా ముఖం ప్రదీప్తమయింది. ఉత్కంఠతతో "బాబుగారిని పైకివచ్చి కూర్చోమను నేనిప్పుడే వస్తా." అని వడివడిగా వెళ్ళిపోయింది.

కొంతసేపటికి టీ సరంజామాతో శశాంకుడువున్న గదిలోకి వచ్చింది. శశాంకుడు చిరునవ్వు నవ్వి చదువుతున్న పుస్తకాన్ని ప్రక్కన పెట్టి 'రండి కోసలా! మీ కోసమే ఎదురు చూస్తున్నాను" అన్నాడు.

కోసల నవ్వుతూ టీ కప్పు శశాంకునికి అందించి ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చుంది. ఆమె కోమల స్వరంతో చిన్నగా నవ్వి "మీరీరోజు ఎందుకో అమితానందంగా వున్నారు." అన్నది.

శశాంకుడు తల వూపుతూ "అవును ఈ రోజు నేను కోరుకున్నది సాధించబోతున్నాను" అన్నాడు.

ఇక్కడ కొంత విషయం చెప్పవలసి వున్నది. కోసల అంతులేని సంపదకు సర్వాధికారిణి. ఇటీవలే ఆమెకున్న ఒక్క దిక్కూ అయిన తండ్రి మరణించడంతో ఆమె అనాథ అయింది. శశాంకుడు మరీ దరిద్రుడు కాదుగాని తిండి. బట్ట సంపాదించగల సంపాదనా పరులే శశాంకునికి. కోసలకూ కాలేజీలో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం అలా పెరుగుతూనే వచ్చింది అతని భావాలకు ఆమె ఎంతో ముగ్ధురాలయ్యేది. అతనికి తెలియకుండానే అతన్ని ఆరాధించడం ప్రారంభించింది.

ప్రస్తుతం శశాంకుడన్న మాటకు



మురిపాల మూడు వసంతాలు నిండగా
మరి మా బాబు చదవాలి నిండుగా
మా గుండెల ప్రమోద వెల్లువ నిండగా
శ్రీనివాస్‌కి శుభాకాంక్షలతో
ADVT

కోసల ఉత్సుకతతో "అయితే చాలా పెద్ద కార్యాన్నే చేపట్టబోతున్నారన్నమాట." అన్నది.

శశాంకుడు నవ్వి "నా ఆదర్శాలు, భావాలు, నేటితో చిగురులు తొడిగి మొలకెత్తబోతున్నాయి" అన్నాడు.

అతని మాటలకు కోసల ఉత్తేజితురాలై "మీరు ఏది చెప్పబోయినా అది నాకు అర్థం కాదు సరికదా, అసలు విషయమే బోధపడదు" అన్నది.

శశాంకుడు నవ్వి "మీ తోట ఈ రోజు చాలా అందంగా వుంది చూద్దాం పదండి" అన్నాడు.

కోసల లేచి మెల్లగా తోటలోకి దారి తీసింది. ఆమెకు శశాంకునిమీద అంతులేని అనురాగం. ఎంతో ఆరాధిస్తున్నది ఆ విషయం శశాంకునికి తెలియదు. తెలిసినా అతను దానికి సమ్మతించడని కోసలకు బాగా తెలుసు. కాని రోజు రోజుకూ ఆమెలో శశాంకుని పట్ల ఆరాధన పెరుగుతూనే వుంది.

శశాంకుడు విరగబూసిన మల్లె పొద కేసి నడిచాడు. మల్లెల సువాసనతో ఆ ప్రదేశమంతా నిండిపోయింది. ఆ సువాసనతో బాటు ప్రక్కనున్న పున్నాగ చెట్ల పువ్వులు నేల మీద కుప్పలుగా రాలి సుగంధాన్ని చిలికిస్తున్నాయి.

"మానవులుకూడా ఇదే మాదిరి మంచి సువాసన కలిగిన మనసు కలవారై వుంటా లంటే ఏం చేయాలి" అన్నాడు శశాంకుడు.

కోసల చిలిపిగా నవ్వుతూ "ఈ పూలను ఒంటికి రాసుకోవాలి అన్నది."

ఆ మాటకు శశాంకుడుకూడా నవ్వుతూ "అలా చేస్తే మానవుని గొప్పదనం ఏం ఉంటుంది కోసలా?" అన్నాడు.

ఆమె తల తిప్పుతూ "మానవుడు గొప్పదనంకోసం కొన్ని కృత్రిమమైన పనులు చేయక తప్పదు శశాంక బాబు" అన్నది.

"ఇక అప్పుడు మానవుని బుద్ధికూడా కృత్రిమమైపోతుందేమో?"

"కొన్ని పనులు చేసినంత మాత్రానే అతని మనసు కృత్రిమమైపోతే అతడు పనికిమాలినవాడనే చెప్పవచ్చు."

ఆ మాటలు శశాంకుని కెంతగానో నచ్చాయి. ఆమె మాటను సమర్థిస్తూ "తప్పక అంతే కోసలా. నేనిప్పుడు కొంతకాలం ప్రజాసేవ చేయటానికి వెళదామని అనుకున్నాను" అని తాను చెప్పాలనుకున్నది చెప్పేశాడు.

శాంతరసశోభితమైన ఆమె మొహంలో ఒక్కసారిగా అశాంతి రేఖ మెరసి మాయమైంది తిరిగి "అయితే మీరు ఎన్నాళ్లకి తిరిగి వస్తారు" అన్నది.

శశాంకుడు దృఢంగా "ఇక అక్కడకు వెళ్ళిన తరువాత తిరిగి రావడమంటూ జరగదేమో బహుశ ప్రజాసేవ చేయటంలో ఎంతో తృప్తి వుంటుందని అనుకున్నాను. నా జీవితం అంతా ప్రజాసేవకే అంకితం చేయాలనుకున్నాను." అన్నాడు.

ఒక్కసారిగా ఆమె మొహంలో హృదయోద్వేగం ప్రతిఫలించింది. చలించే కంఠంతో "ఈ ఊరు పనికిరాలేదా ప్రజాసేవకి" అన్నది.

శశాంకుని కళ్ళలో మెరపు ద్విగుణీకృతమై "ఇక్కడికంటే దీనులింకా దేశంలో చాలామంది ఉన్నారు" అన్నాడు.

"అయితే నేనూ మీ వెంట వస్తాను, "నన్నూ తీసుకెళ్ళండి" అన్నది.

శశాంకుడు ఒక్కసారి ఉత్తేజితుడై "నువ్వూ వస్తావా?" అన్నాడు.

"అవును. ఏం? రాకూడదా?"

శశాంకుడు దృఢమైన అభిప్రాయం కలవాడు. ఇతరుల జీవితాన్ని సరిదిద్దటమే అతని ఆశయం అలాంటప్పుడు అతడు ఎంతో సంతోషంతో జీవించవలసిన కోసల జీవితం వేరే విధంగా మార్చటానికి మనస్కరించలేదు. అంతేగాక గొప్ప కుటుంబంలో పుట్టి ప్రజాసేవ చెయ్యాలంటే సాధ్యం కాదు కోమలమైన ఆమె శరీరం ఆ శ్రమ చేయలేదు అందుకే "వద్దు కోసలా నువ్వు రావడం అసంభవం" అన్నాడు

కోసల గద్గద స్వరాన "మీకు అభ్యంతరం లేకపోతే నన్నూ మీ వెంట తీసుకు వెళ్ళండి" అన్నది.

అతను అది తాత్కాలిక నిర్ణయమని తెలుసుకుని నిర్దయగా "అవును నాకు అభ్యంతరమే" అన్నాడు. ఒక్కసారిగా కోసల కూలిపోయినట్లైంది. ఆమె కట్టుకున్న ప్రేమ మందిరాలన్నీ కూలిపోయి పాడైపోయాయి. ఆమె అశ్రుపూర్ణమైన కంఠస్వరాన "అయితే ఎప్పుడు మీరు వెళ్ళటం" అని అడిగింది.

శశాంకుడు "బహుశ ఇవ్వాళే కావచ్చు" అన్నాడు.

తిరిగి ఆమె మాట్లాడలేదు. కర్తవ్య విమూఢలా నిర్నిమేష దృష్టిని శూన్యంలోకి ప్రసరింపచేస్తూ కూర్చుంది

కొంతసేపు మౌనంగా కూర్చుని "వెళ్ళాక మీ జాడైనా తెలియచేస్తారా?" అన్నది.

"అవసరమైతే తప్పకుండా."

"అహ అలా కాదు తెలియచేస్తానని ఒట్టు వేయండి" అన్నది.

శశాంకుడు "తప్పక తెలియజేస్తా." అన్నాడు.

శశాంకుని మనసు కోసలకు బాగా తెలుసు. అతడు ఏ మాటైతే అన్నాడో అది సాధించి తీరగలడని ఆమెకు తెలుసు. ఇప్పుడు శశాంకుడు తన వివరాలేమీ అంత సులువుగా తెలియజేసేట్లు కనిపించడం లేదనే విషయం ఆమెకు సులభగ్రాహ్యమైంది.

"ఎప్పటికైనా అవసరం వస్తే ఈ మూఢురాలిపైన దయతలచి కబురుపంపండి అన్నది ఆ తరువాత ఆమెకు గొంతు గద్గదమై మాటలుసరిగా రాలేదు.

"అలాగే" అని శశాంకుడు కాస్సేపు కూర్చుని నాకు సమయమైంది కోసలా. వస్తాను" అని బహుశా ఇదే ఆఖరి కలయిక కావచ్చు మనకు" అన్నాడు.

కళ్ళనుంచి జారుతున్న కన్నీళ్లు తుడుచుకుంటూ "ఆ మాట అనకండి. మీరు మరలా తిరిగి రావాలని కోరుకుంటాను" అన్నది.

శశాంకుడు దృఢ సంకల్పంతో ఉన్నాడు. అందుకే అతడు ఏ విధంగాను చలించలేదు. ఆమె దగ్గర సెలవు తీసుకుని ఆ భవనాల్ని దాటి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక కోసల మొదలు నరికిన మానులా కూలబడిపోయింది. అప్పటిదాకా ఉబికివస్తున్న కన్నీళ్ళు ఒక్కసారిగా ఉప్పెనలా ముంచుకు

వచ్చాయి. ఆమె రోదనకు ప్రకృతేమీ చలించక నిశ్చలంగా వుంది. చాలాసేపటి వరకూ ఆమె అలా దుఃఖిస్తూనేవుంది ఒక్కసారి చిన్నగాలి తిరిగి లేచింది ఆ గాలికి పున్నాగ చెట్టుపూలు జలజలా రాలి నేలమీద పడ్డాయి. కోసల ఆశలుకూడా రాలిపోయాయి.

విశాలమైన ఆ భవనంలో సుఖప్రద మైన జీవితం గడపటానికి కావలసిన దానికన్న హెచ్చు సామగ్రి వుంది. కాని కోసలకు అవేమీ అక్కరలేదు. అతని అనురాగం ఆమె పొందగల్గితే సకల సంప దలనూ తృణప్రాయంగా త్యజించి వుండేది.

కోసలకు జీవితమొక అంతులేని శూన్యంగా తోచింది తానొక భయంకర మైన అంధకారంలో నిలబడి వుంది. దూరాన ఒక దీపం మినుకు మినుకు మంటోంది. దాన్ని చేరుకోవాలని ఆతృత పడుతోంది. పసిగెడుతోంది. కాని ఆ దీపం అంతకంతకూ దూరమౌతోందే కాని దగ్గరవడం లేదు. ఒక్కసారిగా కోసల పెద్దపెట్టున రోదించింది. ఆమె కన్నీళ్ళు కణతలమీదుగా జారి ఆమె కేశాలను తడిపి ముద్దగా చేశాయి.

మెల్లగా తన గదిలోకి నడిచింది. తీగ తెగిన వీణ అక్కడ కనిపించింది. ఆ తెగిన వీణకు ప్రత్యామ్నాయంగా ఆమె దాని ప్రక్కన నిర్నిమేష దృష్టితో నిష్క్రియగా కూర్చుండిపోయింది. ●

# సగటు హీరో

(26వ పేజీ తరువాయి)

శంలోకి వదుల్తూ పెద్ద ఫోజులో వున్నాడు వాడు. గిరిజను ఏమన్నాడో నాకు సరిగ్గా వినిపించలేదు. కాని గిరిజ వాడిని 'రాస్కెల్' అనీ 'మేనర్ లెస్ బ్రూట్' అనీ తిడుతోంది. వాడు అవన్నీ దీవెనలుగా భావించి నవ్వుతున్నాడు.

నేను వాడి చొక్కా కాలరు పట్టుకుని పైకి ఎగరేసి ఆకాశంలోకి విసురుతాననీ. చేతులూ, కాళ్ళూ విరగ్గొట్టి సైడు కాలువ లోకి విసురుతాననీ గిరిజ ఎదురు చూస్తూ కొంతసేపు నిల్చుంది. నేను మాటా పలుకూ లేకుండా బొమ్మలా చూస్తూ నిల్చుండేసరికి కోపంతో విసవిసలాడుతూ వెళ్ళిపోయింది.

"ఏం ఎందుకని? నువ్వు వాడిని తన్న లేనంత బలంగా వున్నాడా?" ప్రశ్నించాను.

"ఎంత బలంగా వున్నా ఆడపిల్లని గొడవ చేసినవాడిని తంతే నలుగురూ పోగై మనకి సపోర్టు చేస్తారు. వాడిని తన్నడం సులభమే."

"మరెందుకు తన్నలేదు నువ్వు? ఆడ పిల్లముందు పిరికివాడిలా నిల్చుండిపోయా వెందుకు?" అన్నాను.

"ఏం చెయ్యనురా! వాడు మన బాస్ కొడుకు" అన్నాడు చంద్రం.


నేను వులిక్కిపడ్డాను. "ఏమిటి?"

"అవున్రా బాబూ! వాడు మన బాస్ కొడుకే. వాడిని గొప్పకోసం తంతే వాడు వాళ్ళ నాన్నకి చెప్పి ఉద్యోగం పీకిం చేస్తాడు. బంగారం లాంటి ఉద్యోగంపోతే ఎలారా?" అన్నాడు చంద్రం

నేను తల వూపాను నిజమే అన్నట్లు.

"ఆ రోజు నుంచి గిరిజ ఎదుటపడా లంటే సిగ్గుగా వుందిరా! తప్పించుకుని తిరుగుతున్నాను" అన్నాడు చంద్రం.

పాపం వాడి ముఖం చూస్తే జాలేసింది నాకు. ●



దాసరి నారాయణరావు

పిల్లలను పెంచడం పెద్దవాళ్ళ బాధ్యత
పెరిగాక పెద్దవాళ్ళను చూడ్డం పిల్లల బాధ్యత
ఏది ఎవరు విస్మరించినా సృష్టిధర్మాన్ని అతిక్రమించినట్లే



జి. కామరాజు సమర్పించు
ఉమాఫిలిమ్స్ కంబైన్స్

సంగీత

ఈస్ట్‌మన్ కలర్

నిర్మాత: హరగోపాల్
సంగీతం: యస్.పి. బాలసుబ్రహ్మణ్యం
కెమెరా: కె. యస్. మణి

DWARAKA